# 92. 'మధ్య' నిషేధం

'శంకరాభరణం' సినిమా రాక పూర్వపు రోజుల్లో ఒక జోకు.

ఒక ఊళ్లో ఒక ఏ.సీ. హాల్లో ఒక సంగీత కచేరీ జరుగుతోందట. వందో రెండు వందలో రూపాయలు ఖర్చు పెట్టి డీలక్స్ సర్కిల్లో కూర్చోవడానికి టిక్కెట్ కొనుక్కున్న ఒక పెద్ద మనిషి (ఇంతకన్నా పెద్ద పనేదో ఉండడం వల్ల) కచేరీకి లేటుగా వచ్చాడట. తలుపుకి అడ్డంగా నుంచున్న వ్యక్తితో "తలుపు తెరవ్వయ్యా; నేను లోపలికెళ్లాలి!" అన్నాడట.

"అయిబాబో; తమరు లోపలికెళ్లడానికి తలుపు తీత్తే యాభై యిద్దరు మంది ఇవతలికి ఒచ్చేత్తానికి రడీగా ఉన్నారండి". అన్నాడట ఆ గేట్ (గ్రేట్) మాన్.

★ ★ ★

ఇంచు మించు ఇలాటిదే నిజంగా జరిగిన ఒక ఉదంతం నాకు జ్ఞాపకం ఉంది. మనం కాసేపు రాగద్వేషాలు మరిచి ఆనందించడానికి సదుపాయం ఉంటుందని మనుషుల పేర్లూ మరికొన్ని పేర్లూ మార్చుకుని చెప్పుకోవలసిన అవసరం ఉంది.

1979 లో మాట. మా ఊరికి నాన్‌రాజుగారని ఒకాయన "ఆన్ డ్యూటీ మీద" వచ్చేరు. (అసలు ఆయన పేరు నారాయణరాజుగారే. కాని ఆయనకి రాజ ఠీవి ఏమీ లేదని కొందరు 'నాన్-రాజు' అన్నారు. మరికొందరేమో ఆ పేరంతా పలకలేక "నా(న్రాజు" అన్నారు.)

ఈ నాన్ రాజు గారు ఎంత పెద్ద ఆఫీసరో అంత పెద్ద కవి. ఏడాదికి ముప్ఫయ్యారుకి తక్కువ కాకుండా కవితలు రాసి రెండు రకాల పత్రికలకీ ఇచ్చేవారు (రెండు రకాలంటే - ఆయన్ని కవితలు రాయమని అడిగే రకం, అడగని రకం అని భావించాలి!) ఏడాది పూర్తవగానే ఆ కవితలన్నీ ఒక పుస్తకంగా వేయించేవారు. (ఆయన ఊరికే ఎవరికో ఫోన్ చేస్తే, ఆ ఫోన్‌లో అవతల్నించి మాట్లాడిన వారికి ఆయనతో పన్లుండడం వల్ల వాళ్లే ఆ పుస్తకాలు వేయించే వారని కూడా అనుకుంటారు.) ఈ పద్ధతి ఇప్పటికి పదిహేనేళ్ళుగా అమలు అవుతోంది.

సరే; ఆయన మా ఊరొచ్చేరు (అక్కడ గదా, మనం ఉన్నాం!)

నా(న్రాజుగారు పెద్దకవి- అని పారిశ్రామికవేత్తలూ, పెద్ద అధికారి- అని స్థానిక రచయితల సంఘాలూ గుర్తించాయి గనుక; ఆయన ఈ ఊళ్లో మూడు రోజులు ఉంటారని తెలిసిపోయింది. మా ఊళ్లో ఉన్న ఎనిమిది సాహిత్య సమాజాల్లో ఒక సమాజం ప్రెసిడెంటు గారు ఆయన్ని ఎలాగో ఒప్పించి స్థానిక ఔత్సాహిక కవి కుమారుల ప్రయోజనార్థం "నారాయణరాజుగారితో ఒక సాయంకాలం" అనే కార్యక్రమాన్ని రూపొందించి కరపత్రాలు అచ్చు వేయించేరు (నాన్-రాజు గారే ఈ ప్రెసిడెంటుగార్ని పట్టుకుని ఆ సభ ఏర్పాటు చేయించుకున్నారని కూడా కొందరన్నారు)

సరే, (కవితా) గానసభ హోటల్ "తిలోత్తమా" లో ఏర్పాటు చేసేరు. తిలోత్తమా ఈజ్ ఈక్వల్ టూ తిల+ఉత్తమ - అనగా (డబ్బుకి) తిలోదకాలు వదులుకోడానికి ఉత్తమమైన మార్గం అని ఎవరో ఉత్పత్త్యర్థం చెప్పేరు గాని దాన్ని అంతగా పట్టించుకోనక్కర్లేదు.

కవితా గానానికి ముందర రెండు స్వీట్లు, రెండు హాట్లు, కాఫీ, సదస్యులందరికీ "పెట్టు పోతలు" అయ్యాయి. అందరూ ఈ (ఏసీ) మినీ కాన్ఫరెన్స్ హాల్లోకి వెళ్ళి అతి సౌఖ్యవంతాలయిన (స్టఫ్డ్) కుర్చీల్లో కూర్చున్నారు.

కవితాగానం మొదలు పెట్టిన కొంత సేపటికి సదస్యుల్లో చాలామందికి అంత "కంఫర్టబుల్" కుర్చీలూ కూడా కొన్ని సినిమా హాళ్లలోని కుర్చీల్లాగ నల్లులో మేకులో ఉన్నట్టు బాధాకరంగా మారడం - ఇంచుమించు అందరికీ తెలిసినా, నాన్ రాజుగారు పెద్ద ఆఫీసర్ కదా అని - "నోటికి జడిసీ నోటి కంపుకి జడిసీ" - వాకౌట్ స్వాతంత్ర్యాన్ని వాడుకోకుండా అలా కూర్చునే ఉండిపోయారు.

అయితే 'నేడు' పత్రికా విలేఖరి 'పతంగం' మాత్రం అంతవరకూ రాసుకున్నది మడతపెట్టి జేబులో పెట్టుకుని లేచాడు. 'అదేం?' అన్నట్టుగా అధ్యక్షులవారు చూసేరు. పతంగం గారు ఆయన దగ్గిరికెళ్లి వొంగుని "వెంటనే రిపోర్టు కంపోజు కివ్వకపోతే రేపటి పేపర్లో రాదు. ఎల్లుండేమో నాన్రాజుగారు ఈ ఊళ్లో ఉండరు" అని చెప్పేడు. అధ్యక్షులవారు జేబులోంచి ఒక తాళం చెవి తీసి, కార్యదర్శిగారికి సంజ్ఞ చేసి తలుపు తెరవమని కూడా సంజ్ఞే చేశారు. అయితే అక్కడున్న ప్రేక్షకులూ, శ్రోతలూ యావన్మందీ కూడా కవితా సంకేతాల్ని సహా అర్థం చేసుకోగలవారు. అంచేత ఈ భౌతికమైన సంజ్ఞని సునాయాసంగా అర్థం చేసుకున్నారు. ఫలితంగా; పతంగం గారితో బాటు పాతిక మంది దాకా "సురక్షిత ప్రాంతాలకి" తరలి వెళ్లిపోయారు.

దాంతో అయిపోలేదు. మర్నాడు తెల్లారేసరికి వెలువడిన "నేడు" పేపర్లో "తిలోత్తమలో కవోత్తమ" అనే టైటిల్‌తో వార్త వచ్చింది. అయితే వార్త అంతా ఒక యెత్తు, చివరి పేరా ఒక యెత్తు అని ఎవరో అంటేనూ; ఎప్పుడూ పేపరు కొనని వాళ్లు కూడా ఆకర్షితులయ్యారు.

"కవితా గానానికి ముందర వడ్డించిన తినుబండారాల వల్ల కవితా బండారం అంతగా బైటపడలేదు. ఒక వేళ ఎవ్వరైనా బైటపడాలనుకున్నా అందుకు వీల్లేకుండా హాలు తలుపులకి తాళాలు వెయ్యడం విశేషం" అని ఆ రిపోర్టు ఆఖరి పేరాలో (ముక్తా) ఇంపుగా రాశారు.

ఆ తరువాత కొన్నాళ్లకి, మా ఊరి 'ఆ' సాహిత్య సమాజం వారు. ఒక సావనీర్ తలపెట్టి దాంట్లో ప్రకటించడం కోసం కనీసం ఐదు అడ్వర్టయిజుమెంట్లు ఇప్పించవలసినదిగా నాన్‌రాజు గార్ని కోరారు. మామూలుగా ఏదో ఉత్తరం రాస్తే సరిపోయి ఉండేదేమో. కాని, ఆ అధ్యక్షులవారు; నాన్‌రాజు గారికి ఒక ఉత్తరం విడిగా రాస్తూ "తమరు పదినెలల క్రిందట మా ఊరికి విచ్చేసినప్పుడు తమరు కవితా గానం చెయ్యడం మా ఔత్సాహిక కవులను ఆశీర్వదించడం అదంతా నిన్న మొన్న జరిగినట్టుంది" అంటూ ఏదో ఇరికించేరు. దాంతో వ్యవహారం బెడిసికొట్టినట్టుంది. ఒక్క ప్రకటన రాలేదు; పైగా సావనీర్‌లో వెయ్యమని ఒక 'మెసేజి' కూడా రాలేదు.

(ఏదో 'స్మాల్ కాజ్'లో బోనులో నిలబడ్డ ముద్దాయి "నిన్నెక్కడో చూసినట్టుందే!" అని మేజిస్ట్రేటుగారు పలకరించారని సంబరపడిపోయి "అయ్యో, మీ అమ్మాయిగారికి ఆరునెల్లపాటు సంగీతం చెప్పాను కదండీ!" అన్నాడట. దాంతో మేజిస్ట్రేటుగారు; "నువ్వా, నాయనా? నయమే! నెల రోజులు వేద్దామనుకున్నాను!" అని మనస్సులో అనుకుని, "మూడు నెలలు!" అన్నారట)

★ ★ ★



B

మొన్నీ మధ్య ఊళ్ళో మూడురోజులపాటు ఒక విదేశీ జట్టుకీ మన దేశపు జట్టుకీ మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఆ సందర్భంగా కొన్ని అవాకులూ చెవాకులూ:

"ఫారిన్ వాళ్లు వస్తున్నారని రోడ్డు బాగు చేసేరు. స్టేడియం కంపుకొట్టకుండా శుద్ధి చేసేరు. అయినా నీలాంటి వీర క్రికెటాభిమాని వెళ్ళలేదే!"

"రోడ్డు బాగు చేసేరు, అంతా నిజమే కాని; వన్ వే ట్రాఫిక్ పెట్టేరుగా, స్టేడియంలో దుర్వాసన అంతా ఈ రోడ్డు మీదకి చేరిపోయింది."

★ ★ ★

కనీసం లక్షమందయినా వస్తారనుకున్నారట. కానీ ఆ మూడు రోజులూ కరెంటు పోలేదని అందరూ ఇళ్లల్లో ఉండిపోయి టీవీల్లో చూసేశారట మేచి మొత్తం.

ఇరవై వేల టిఫిన్ పొట్లాలూ, పదివేల డ్రింకు బాటిల్సూ (అమ్మకానికి) రప్పించేరట. అమ్మకాలు పదిశాతం కూడా చేరలేదట.

మూడో రోజు టి.వి.లో మేచ్ "ఇవ్వడం" లేదని తెలిసి సుమారొక మూడువేలమంది వచ్చేరట. "గేటు బైట సుమారు రెండు వందల మంది ఉన్నారు. వాళ్ల దగ్గర టికెట్లు లేవు. పోనీ గేటు తెరిచేద్దామా?" అని అడిగితే "ఒద్దు. గేటు తెరిస్తే లోపలున్న వాళ్లలో చాలామంది బైటికి వెళ్లిపోతారు. ఆట ఏమవుతుందో ముందే తెల్సిపోయింది!" అని జవాబు. ★

# 93. అనగనగా ఒక కుర్చీ

**బా**పుగారి కార్టూన్ ఒకటుంది. చాలామంది చూసే ఉంటారు గాని; చాలా గొప్ప కార్టూన్ కనకానూ, నాకు బొమ్మలు వెయ్యడం చేత కాకానూ; వాచ్యం చేయవలసి వస్తోంది. ఒకానొక ఆఫీసరు గారు తన ఆఫీసులో ఆ సీటూ ఈ సీటూ పరిశీలించి చూడ్డంలో పచారు చేస్తుండగా ఒక చోట ఆగి, ఒక టేబిల్ నిండా ఫైళ్ళు అంతెత్తున పేరుకుపోయి ఉండడం గమనించి ఇలా అన్నారు. "ఇవన్నీ క్లియర్ చెయ్యండి. దానికింద ఉండే గుమస్తాని డిస్మిస్ చెయ్యాలి గనక ప్రపోజల్ పెట్టండి".

నేను పని చేస్తూ ఉండిన ఆఫీసులో నా టేబిలు మీద ఫైళ్లు పేరుకుపోయినప్పుడల్లానూ అర్థరాత్రి దాకానూ అపరాత్రి దాకానూ పనిచేసి డిస్మిస్ అయిపోకుండా నెట్టుకొస్తూ ఉండేవాణ్ణి.

అయితే ఒకసారి మా మేనేజరు గారికి దొరికిపోయాను. దానికి కారణం నేను కూర్చోవడానికి వేసిన అల్లకపు కుర్చీలో (చేరబడే బాగం కాక) కింద భాగం అల్లకంలో చిన్న చిరుగు ఏర్పడడం, ఆ చిరుగు పెద్దదై కూర్చోవడానికి ఇబ్బందవుతోందని అక్కడ ఒక 'అట్ట' పెట్టేను; అది నా బరువుకీ కుర్చీ అల్లకం చిరుగుకీ మధ్య నలిగిపోతే కొన్ని పనికిరాని కాగితాలూ పాత మేగజైన్లూ, అతిథులు వదిలేసిన వార్తా పత్రికలు వేసుకుంటూ ఆ కుర్చీకి మాన సంరక్షణ చేసేను. మా మేనేజరు గారు మా సెక్షనుకి పరిశీలనకి వచ్చినప్పుడు వారి గౌరవార్థం లేచి నిలబడకపోతే ఏమీ లేకపోయేదే. కాని, నేను నిలబడ్డం వల్ల బోలెడు గొడవైంది.